# పులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, సహకారం అందించాలి




* జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 5:** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం గ్రామంలో ఒక ఆవు, జీ.ఎర్రంపాలెం గ్రామంలో మూడు దూడలు మృతి చెందిన ఘటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం మధ్యాహ్నం జీ.ఎర్రంపాలెం గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. మూడు దూడల్లో ఒక దూడను పులి తినట్లు అటవీ శాఖ అధికారులు తెలియ చేశారు. పామ్ ఆయిల్ తోటల్లో పులి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కలెక్టర్ సందేశం మేరకు అటవీ శాఖ, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక రెస్క్యూ బృందాలు చేరుకున్నాయని, సీసీఎఫ్ మార్గదర్శకత్వంలో అటవీ బృందాలు థర్మల్ డ్రోన్లు, ట్రాప్ కెజ్‌లు, ట్రాప్ కెమెరాలతో పులి జాడల గుర్తింపుకు చర్యలు వేగవంతం చేశాయని వెల్లడించారు. వెటర్నరీ డాక్టర్లు, వన్యప్రాణి నిపుణులు రంగంలోకి దిగారని, పులి జాడ లభించిన వెంటనే బంధించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పులిని ఎట్టి పరిస్థితుల్లోనూ అలజడి చేయరాదని, అత్యంత సున్నిత స్వభావం కలిగిన వన్యప్రాణి అని తెలిపారు. స్వల్ప అలికిడి జరిగినా పులి మరో ప్రాంతానికి తరలిపోయే అవకాశం ఉందన్నారు. అలా జరిగితే అటవీ అధికారులు పులిని గుర్తించి బంధించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కారణంగా పులిని సురక్షితంగా పట్టుకోవడం సాధ్యం కాదని , ప్రజలు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తూ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఘటన స్థలానికి ఒక కిలోమీటర్ పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి పాదముద్రలను చెడగొట్టకుండా అటవీ బృందాలకు సహకరించాలన్నారు. ఉదయం వేట జరిగిన ప్రాంతానికి పులి మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ఆందోళన చెందకుండా, ఓర్పుతో అధికారుల సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తో కలిసి స్థానిక శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ, ఎస్పీ డి. నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, డీఎఫ్వో బి. ప్రభాకర రావు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం జరిగింది, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.వి. చలపతి రావు, సీసీఎఫ్ బి.ఎన్.ఎన్. మూర్తి, డీఎఫ్వో ప్రభాకర రావు, ఎఫ్ ఆర్ వో ఎస్. దావీదురాజు నాయుడు, ఎన్టీసీఏ అధికారి రాజశేఖర్, మత్తు వైద్యులు డా. ఫణీంద్ర పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# పెన్ పవర్

పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## రద్దు చేసిన మినీ అంగన్వాడీ లను పునరుద్ధరించాలి



కలెక్టర్ కు మెమోరాడం

**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, ఫిబ్రవరి 5:** గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినీ అంగన్వాడీలను రద్దు చేయడం సబబు కాదని వీటినే పునరుద్ధరించుటకు చర్యలు తీసుకోవాలని అంగన్వాడీలు వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

గురువారం గుర్తేడు మండలం ప్రారంభోత్సవానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. పివిటిజి గ్రామాలు పైడి పుట్ట పసరుగని సింగవరం కోగిత గొంది సింహాద్రి పాలెం వడ్డేపల్లి ఏర్పాటు చేసిన మినీ అంగన్వాడి కేంద్రాలను పునరుద్ధరించుటకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. జనవరి 27,2025 తేదీన పి వి టి జి గ్రామాలలో మినీ అంగన్వాడీలోని ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జనవరి 10, 2026 న మెమో నెంబరు 160 21/1/2025న ఐసిడిఎస్, డబ్ల్యూ ఓ & సి డబ్ల్యూ ద్వారా మినీ అంగన్వాడీ వెళ్ళాను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. పివిటి జి గ్రామాలలో ఏర్పాటు చేసిన మినీ అంగన్వాడీలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

## గుర్తేడు మండల వాసుల నెరవేరిన చిరకాల వాంఛ



వెల్లి విరిసిన అభినందనలు



**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్ ఫిబ్రవరి 5:** గుర్తేడు మండలంగా ఏర్పడాలని దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న మండల వాసుల కల నెరవేరిందని, ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే శిరీష దేవి, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్మరన్ రాజ్, పలువురు అధికారులకు ప్రజాప్రతినిధులకు అభినందనలు వెల్లువిరి సాయి.

గురువారం గుర్తేడు నూతన మండలం ప్రారంభోత్సవానికి జిల్లాస్థాయి, డివిజన్ స్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులకు,రాజకీయ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గుర్తేడు సర్పంచ్ గొర్ల దుష్యంతుడు అధ్యక్షతన జరిగిన సభలో రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి మాట్లాడుతూ పరిపాలనా అభివృద్ధి వేగవంతంగా ఉండాలంటే సౌలభ్యం ప్రాముఖ్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తేడు మండలాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. గుర్తేడు మండల కేంద్రంలోని అన్ని శాఖల కార్యనిర్వహణ చేయడం జరుగుతుందన్నారు. గుర్తేడు మండల అధికారులుగా నియమించబడిన యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిపాలన వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ విధానాలపై ఎమ్మెల్యే వివరించారు. నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా మంచి సేవలు అందించాలని కోరారు.

ఎమ్మెల్యే కలెక్టర్ తదితర అధికారులకు బ్రహ్మరథం పట్టిన ఆదివాసీలు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు గిరిజన సాంప్రదాయాల మధ్య ఘన స్వాగతం పలికారు. మహిళలు ఆరుతులతో స్వాగతం పలుకుతూ గిరిజన నృత్యం దింసా కోలాటాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, వై రామవరం ఎంపీపీ ఆనంద్ జెడ్పిటిసి వెంకటలక్ష్మి మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్ వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ ఎంపీటీసీలు బీసీ విభాగం రాష్ట్ర నాయకులు కరక వెంకటరమణ ఏఎంసి డైరెక్టర్ సలాది బాపిరాజు బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి జనసేన మండల పార్టీ అధ్యక్షులు పుష్పరాజ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 612 సర్వే నెంబర్‌పై సమగ్ర విచారణ జరిపించండి



* టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు
* కలెక్టర్‌కు ఫిర్యాదు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 5:** పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని 612 సర్వే నెంబర్‌పై సమగ్ర విచారణ జరిపించి సదరు భూమి కబ్జాకు గురైతే అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు కోరారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్ ఫిర్యాదు చేసేందుకు ఆయన ఈ రోజు వెళ్లగా ఆయన సెలవులో ఉన్నందున కలెక్టర్ కీర్తి చేకూరికి సదరు ఫిర్యాదు పత్రాన్ని, ఒక పెన్ డ్రైవ్‌ను అందచేశారు. అనంతరం మజ్జి రాంబాబు మాట్లాడుతూ రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ముఖ్య అనుచరుడు, అతి సన్నిహితుడైన రామశర్మ ఇటీవల రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో భరత్ రామ్‌పై ఒక ల్యాండ్ విషయమై ఆరోపణలు చేశాడని తెలిపారు. భరత్ రామ్ కార్యాలయం ఉన్న వివిఎల్ పురం సమీపంలోని పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని మార్గాని ఎస్టేట్‌కు ఆనుకుని ఉన్న ఒక ల్యాండ్‌ను కలిపేసుకున్నారని ప్రధానంగా ఆరోపించడం జరిగిందన్నారు. సదరు పంచాయతీ పరిధిలోని 612 అనే సర్వే నెంబర్ భూమిని అధికార బలంతో మార్గాని భరత్ రామ్ తన మార్గాని ఎస్టేట్‌లో కలిపేసుకున్నారని ఆరోపణ చేయడం జరిగిందన్నారు. అలాగే సదరు మార్గాని ఎస్టేట్ 2019 నాటికి అంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు, మార్గాని భరత్ రామ్ ఎంపీ కాకముందు ఎంత ఉండేది.... 2024 నాటికి ఏ మేరకు పెరిగిందనేది సమగ్ర సర్వే చేస్తే తెలుస్తుందని రామశర్మ మీడియా ముఖంగా ఆరోపణ చేయడం జరిగిందని, రామశర్మ చేసిన ఆరోపణలో వాస్తం ఎంత... అవాస్తం ఎంత ఉంది అనే విషయాలను నిగ్గు తేల్చేందుకు సంబంధిత అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, రామశర్మ నిర్వహించిన మీడియా సమావేశపై వీడియోతో కూడిన పెన్ డ్రైవ్‌ను కలెక్టర్‌కు మజ్జి రాంబాబు అందచేసి కోరారు. అలాగే భరత్ రామ్ మృతుడు కుంచే సత్యం అనే వ్యక్తికి రూ. 3,50,000 లక్షలు బాకీ ఉన్నట్టు అతడి డైరీలో రాసుకోగా అతని భార్య సదరు బాకీ కోసం మూడేళ్లుగా తిరుగుతున్నా భరత్ రామ్ ఇవ్వడం లేదన్న విషయాన్ని కూడా రామశర్మ చెప్పుకొచ్చారని వివరించారు. భరత్ రామ్ ఎంపీగా అధికారంలో ఉన్న కాలంలో అతని వెంటే ఉన్న రామశర్మ ఈ ఆరోపణలు చేయడంతో ఇవన్నీ నిజమని తామే కాదు నగర ప్రజలంతా నమ్ముతున్నారని అన్నారు. టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకీ రామయ్య, బుడ్డిగ రవి, తంగెళ్ళ బాబీ, కంటిపూడి శ్రీనివాస్, కడలి రామకృష్ణ, బుడ్డిగ గోపాలకృష్ణ, మొకమాటి సత్యనారాయణ, జవ్వాది మురళి, దాస్యం ప్రసాద్, అస్లాం, నిమిష కవి కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పట్టాలు కప్పక... ప్రమాదాన్ని గమనించక



**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 5 :** సీతానగరం మండలంలోని సింగవరం ఇసుక ర్యాంపు నుండి అధిక లోడుతో పట్ట పగలే ఇసుక రవాణా చేస్తూ దర్జాగా అమ్ముతూ అధికారులకు మమ్మల్ని పట్టుకోండి అని సవాల్ విసురుతున్నారు. ఇసుక లారీలపై తరలించే భారీ టిప్పర్లపై పట్టాలు కప్పకుండా తరలిస్తుండడంతో ప్రజలు వాహన చోధకులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టిప్పర్లు లారీలు ఎక్కడ భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు వాహనాల్లో మోతాదుకు మించి తరలిస్తున్నారు. అధికారులు ఈ ఇసుక తరలించే లారీలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వగా కలిసిన వైసీపీ ఇంచార్జి వడ్డీ రఘురామ్ నాయుడు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 05.** భీమవరంలో జరిగిన శాసన మండలి చైర్మన్ క్రొయే మోషేను రాజు కుమారుడు వివాహాని కి హాజరయన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వగా కలిసిన తాడేపల్లిగూడెం వైసీపీ ఇంచార్జి వడ్డీ రఘురామ్ నాయుడు హెలీప్యాడ్ వద్ద కలిసి కొత్త సమయం మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్ అర్బన్ రీ సర్వే లో భాగముగా రాష్ట్రంలో లో పైలట్ ప్రాజెక్ట్ గా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎంపిక.



**తాడేపల్లిగూడెం పెన్ పవర్. ఫిబ్రవరి 05.** పురపాలక సంఘం కార్యాలయంలో సచివాలయం సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ ఎమ్. ఏసుబాబు అధ్యక్షతన అర్బన్ రి సర్వే పై సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ రీ సర్వే లో భాగము గా రాష్ట్రంలో లో పైలట్ ప్రాజెక్ట్ గా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎంపిక అయ్యిందన్నారు. ల్యాండ్ రికార్డ్స్ లు మరియు ఓనర్ షిప్ రికార్డ్స్ లో పెండింగ్ ఉన్న వర్క్ కంప్లీట్ చేయాలన్నారు. వార్డు లెవెల్ లో ఇప్పటికీ డాక్యుమెంట్ ఇవ్వని ల్యాండ్ లేదా బిల్డింగ్ యజమానులు మీ దగ్గర సచివాలయం కి వెళ్లి ఇంటి డాక్యుమెంట్స్ సబ్మిట్ చేసి మీ యెక్క ఆస్తికి సంబంధించిన వివరాలు సరిచూసుకోవాలని తెలిపారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ దేశం లోనే మోడల్ ప్రాజెక్ట్ గా ఉందన్నారు.
మోడర్న్ డిజిటలైజేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ లో భాగము గా ప్రతి అర్బన్ ప్రాపర్టీకి కి యూనిక్ నెంబర్ ఇవ్వబడుతుందన్నారు.
పట్టణ ప్రజలందరూ సహకరించాలని తెలియజేశారు. పురపాలక సంఘానికి చెందిన ఇంటి పన్ను మరియు కుళాయి పన్నులు బకాయిలు లేకుండా చెల్లించాలని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి సీతారాం, మేనేజర్ రవి సుధాకర్, రెవెన్యూ ఆఫీసర్ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జగదీష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్ , స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు, మరియు సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఊరి బడి ఉంటేనే పేదలకు విద్య

- ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పిద్దాం
- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ



**గంగవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 06 :**ఊరి బడిని కాపాడుకుంటేనే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందుతుందని, లేకపోతే పేదలకు విద్య పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉందని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ అన్నారు.గురువారం గంగవరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిహెచ్ నెల్లిపూడిలో "ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం ఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కె. కృష్ణతో పాటు మండల అధ్యక్షులు కె. బొజ్జిదొర, మహిళా అధ్యక్షురాలు ఎల్. రుక్మిణి దేవి, జిల్లా కౌన్సిలర్ బి. వంశీ ప్రియ, సిహెచ్ వెంకటేశ్వర రావులు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ బడులే పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యనే కాకుండా సంస్కారం, నైతిక విలువలు, మానవతా దృక్పథాన్ని కూడా అందిస్తాయని తెలిపారు.ప్రస్తుతం పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ప్రభుత్వ బడులు అందించే విద్య, మానసిక స్థైర్యం, విలువలే కీలకమని చెప్పారు.కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఒత్తిడులను ఎదుర్కోలేక జీవితంలో వెనుకబడుతున్న ఉదాహరణలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
పేదలకు విద్యనందించే ప్రభుత్వ బడులను పాలకులు భారంగా భావిస్తూ వాటి నిర్వహణ బాధ్యతల నుంచి క్రమేపి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మరోవైపు కార్పొరేట్ మాయాజాలంలో పడిన తల్లిదండ్రులు ఆ విద్య వైపు ఆకర్షితులవుతున్నారని, ఇది భవిష్యత్తులో ప్రభుత్వ విద్య పూర్తిగా దూరమయ్యే ప్రమాదానికి దారి తీస్తుందని హెచ్చరించారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యాసామగ్రి, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఐ.ఎఫ్.పి ప్యానెల్ బోర్డులు, ఎల్ఈడి టీవీల ద్వారా ఆధునిక బోధన జరుగుతోందని తెలిపారు. ట్రిబుల్ ఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ప్రవేశం పొందాలన్నా ప్రభుత్వ బడిలో చదవడం అవసరమని స్పష్టం చేశారు.ఊరి బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజానిదేనని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడులకే ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ కార్యదర్శులు ఎల్. రామచంద్ర రెడ్డి, సిహెచ్ నాగేశ్వరావు, ఎన్. దుర్గాదేవి, పి. విజయకుమారి, కె. భవాని, ఎం. పండు దొర, సిహెచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 8న ప్రజాపిత బ్రహ్మకుమారిస్

- ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రేరణ సభ
- అంతర్జాతీయ ప్రేరణాత్మక ప్రసంగకర్త బికే శివాని రాక




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 5 :**నేటి ఆధునిక సమాజంలో ప్రజలు ఆధ్యాత్మిక భావనను, మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాపిత బ్రహ్మకుమారిస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ రాజమండ్రి ప్రతినిధులు సత్యనారాయణ రాజు, శ్రీవాణి, పార్వతి, శ్రీనివాసులు తెలిపారు.
స్థానిక కార్యాలయంలో గురువారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని, సంతోషం మన చేతుల్లోనే ఉందన్నారు.
ఈ భావన తోనే ఈనెల 8వ తేదీన హుక్కుంపేట జంక్షన్ డి మార్ట్ ప్రక్కన ఆధ్యాత్మిక , మానసిక అవగాహన సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు అంతర్జాతీయ ప్రేరణాత్మక ప్రసంగకర్త బికే శివాని సోదరి వస్తున్నారన్నారు. గత 27 సంవత్సరాలుగా రాజయోగ ధ్యాన సాధనలో నిష్ణాతులని,అంతర్జాతీయంగా అనేక టీవీ కార్యక్రమాల ద్వారా 17 సంవత్సరాల పైగా కోట్లాదిమందికి మార్గదర్శనం చేస్తున్నారని అన్నారు. 2019లో భారత రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ శివానికి నారీ శక్తి పురస్కారం అందుకున్నారన్నారు ఈ సభకు విద్యార్థులు, యువత, ఉద్యోగులు, వైద్యులు, మహిళలు, ప్రజల హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## దెందులూరు మండలంలో అంగన్‌వాడీ భవనాలు పూర్తయ్యేదెప్పుడో..?



- గత ఐదేళ్లలో పట్టించుకోని వైనం



**ఏలూరు పిబ్రవరి 5 పెన్‌పవర్ :**ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆట పాటలతోకూడిన విద్య,గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక పోవడంతో కార్యకర్తలు,ఇబ్బందులు పడుతున్నారు.ఇరుకు గదుల్లోనే చిన్నారులతో కాలం నెట్టుకొస్తున్నారు.గత టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.కేంద్రాల్లోని చిన్నారులు బాలింతలు,గర్భిణులకు ఆరోగ్యకరమైన షోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పోషణ వాటికలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాలకు అందుబాటులో లేకుండా పోయాయి.నిధులున్నా వైకాపా ప్రభుత్వం అంగన్ కేంద్రాల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి,నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో నేటికీ కొన్ని చోట్ల అద్దేభవనాల్లో నిర్వహిస్తున్నారు.
దెందులూరు ప్రాజెక్టు వివరాలు
దెందులూరు మండలంలో 79అంగన్ వాడీ సెంటర్‌లు ఉన్నాయి.దెందులూరు సెక్టార్-1లో 28 అంగన్‌వాడీ కేంద్రాలు ,సెక్టార్-2 పరిధిలో 28,మిగిలినవి రెంట్‌ఫ్రీ,అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.వైకాపా ప్రభుత్వ హాయాంలో దెందులూరు నియోజకవర్గం పాడుఐసిడిస్ ప్రాజెక్ట్ సెక్టార్-2 పరిధిలో నాడు నేడులో మూడేళ్లక్రితం దెందులూరు మండలం సానిగూడెం అంగన్ వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.శంఖుస్థాన చేసిన రెండేళ్లకు పనులు ప్రారంభించారు.అంగన్ వాడీ కేంద్రం భవన నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సెక్టార్-1,సెక్టార్-2లలో చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దేభవనాల్లో నిర్వహిస్తున్నారు.సెక్టార్-2లో సానిగూడెం గ్రామంలో అంగన్ వాడీ భవన నిర్మాణం పూర్తి కాక పోవడంతో కేంద్రాలు అద్దేభవనాల్లో నిర్వహిస్తున్నారు. అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాలకు పోషణ్ వాటికలు ప్రభుత్వం మంజూరు చేయలేదు దీంతో బయట నుంచి కొనుగోలు చేసిన కూరగాయలు,ఆకుకూరలనే తీసుకొచ్చి కేంద్రాల్లో వినియోగిస్తున్నారు.
టీచర్లే ఆయాలు : ఈ రెండు కేంద్రాల్లో సహాయకులు లేరు.దీంతో టీచర్లే చిన్నారులకు వంట చేసి పెడుతున్నారు.ఒకపక్క చిన్నారులకు విద్యాబోధన,గర్భిణులకు పోషకాహార పంపిణీ,తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అసంపూర్తి భవనాలను పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని చిన్నారుల తల్లితండ్రులు కోరుతున్నారు.




## భావి భారత పౌరులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడాలి

**పోలవరం జిల్లా యూటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ**




**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 05 :**రాష్ట్రంలో, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి ప్రభావం రోజురోజుకు పెరుగుతూ కుటుంబాల్లో కల్లోలాలు సృష్టిస్తోందని, యువత జీవితాలను చీకటిలోకి నెడుతోందని పోలవరం జిల్లా యూటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా మహమ్మారి వారం రోజుల్లో ప్రాణాలు తీస్తే, గంజాయి మహమ్మారి జీవితాంతం నరకాన్ని చూపుతూ చంపుతుందని అన్నారు. గంజాయి కారణంగా యువత సహనాన్ని కోల్పోయి సంఘ విద్రోహ శక్తులుగా మారుతున్న పరిస్థితి ప్రమాదకరమని హెచ్చరించారు.యూటిఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన కరపత్రాలను గంగవరం మండల యూటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు.అనంతరం మండలంలోని నెల్లిపూడి కొత్తాడ, గంగవరం ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగవరం, మోహనపురం ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, గంగవరం జూనియర్ కాలేజ్‌లను సందర్శించి విద్యార్థులకు గంజాయి దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కె. కృష్ణ మాట్లాడుతూ, గతంలో రహస్యంగా సాగిన గంజాయి వ్యాపారం నేడు బహిరంగంగా రోడ్లపై విహరిస్తూ అమాయక పిల్లల్ని కూడా బలితీసుకుంటోందన్నా రూ.గంజాయి మాఫియా అడ్డొచ్చిన వారిపై భౌతిక దాడులకు దిగడమే కాక ప్రాణాలు తీసే స్థాయికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు.పాఠశాలలు, కళాశాలల సమీపంలో గంజాయి లభించడం అత్యంత ఆందోళనకరమని, విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్న తీరు తీవ్ర భయాందోళనకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వం సంఘటనలు జరిగిన తర్వాత స్పందించకుండా, ముందస్తుగా పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటేనే గంజాయి మాఫియా అగడాలు అరికట్టవచ్చని సూచించారు.పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో గంజాయి విక్రయాలు, సేవనానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి సేవనంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. గంజాయికి బానిసలైన వారిని గుర్తించి వారికి తగిన చికిత్స అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమంత కుమారి, బి. నాగేశ్వరావు, ఎం. శ్రీరాములు దొర, జి. సోమయ్య, మండల యూటిఎఫ్ అధ్యక్షులు కె. బొజ్జిదొర, సహాధ్యక్షులు ఆర్. చిన్న వెంకటరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎల్. రుక్మిణి దేవి, జిల్లా కౌన్సిలర్లు వెంకటేశ్వర రావు, బి. వంశీ ప్రియా, విజయ కుమారి, భవాని, దుర్గాదేవి, రామచంద్ర రెడ్డి, సత్య కిరణ్ రెడ్డి, సిహెచ్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ పరిధిలో డివైడర్లు, గోడలపై ఏ విధమైన వాల్ పోస్టర్స్ అంటిస్తే కఠిన చర్యలు - కమిషనర్ యేసుబాబు




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 05:**తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలో డివైడర్లు, గోడలపై ఏ విధమైన వాల్ పోస్టర్స్ అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ తాడేపల్లిగూడెం కార్యక్రమంలో భాగంగా పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నాం . ప్రభుత్వ నిబంధనలో అతిక్రమించి వాల్ పోస్టర్స్ అంటిస్తే 10వేల నుండి 1లక్ష రూపాయల వరకు జరిమాన విధిస్తాం అని అన్నారు.
తాడేపల్లిగూడెం అభివృద్ధికి ప్రజలు సహకరించాలి తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్ యేసుబాబు విజ్ఞప్తి తెలియజేశారు.




## హిందూ ధర్మాన్ని కాపాడటం అందరి బాధ్యత: ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 05.** ప్రపంచంలో ఎంతోఘనమైన, పవిత్రమైన హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ద్వారకా నగర్ లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ఆచరించడమే కాకుండా అందులోని గొప్పతనాన్ని ప్రచారం చేయాలని అన్నారు. ఇతర మతాలలో ఉన్న నిబద్ధత హిందువులలో అంతగా కనిపించడం లేదని అన్నారు. ప్రతి హిందువు తన ధర్మాన్ని ప్రచారం చేయాలని కోరారు. ద్వారకా నగర్ లో వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి అందరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ దాసరి మల్లికార్జున రావు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన బత్తుల



**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 5:**ఫిబ్రవరి 15 ఆదివారం మహా శివరాత్రి పర్వదినాన సీతానగరం మండలంలోని వంగలపూడి, పట్టిసీమలో జరగబోయే మహాశివరాత్రి మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సీతానగరం ఎంపీడీఓ, వీ=వా మరియు ఇతర డిపార్ట్మెంట్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ మహా శివరాత్రి పర్వదినం ప్రజలకు అత్యంత ప్రీతిప్రదమైనదని ఈ పండుగను అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని తెలియజేసారు. అలాంటి ఈ మహా పర్వదినం ఆదివారం రోజున రావడంతో భక్తుల మరింత ఎక్కువగా ఆ శివ పార్వతులను దర్శించేందుకు సుదూర ప్రాంతాల నుండి ప్రజలు భారీగా తరలి వస్తారని వారిని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వంగలపూడి నుండి పట్టిసీమ వెళ్లేందుకు రోడ్డు మార్గం, మార్గం పొడువునా మంచి నీటి సౌకర్యం, ప్రధమ చికిత్స కేంద్రాలు, భక్తులకు వసతి మరియు భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

